ఉండ్రుగొండలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

స్వామి వారికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

చివ్వెంల, జూన్ 22 : మండల పరిధిలోని ఉండ్రుగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమారాచార్యులు, ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు శాస్త్రోక్తంగా పూజ లు నిర్వహించి ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

- తృటిలో తప్పిన పెను ప్రమాదం

ట్రాక్టర్ ఢీకొనడంతో విరిగి దాని సపోర్ట్‌తో నిలబడిన విద్యుత్ స్తంభం

ఆత్మకూర్.ఎస్, జూన్ 22 : ట్రాక్టర్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఆత్మకూర్.ఎస్ ఎక్స్ రోడ్డు నుంచి మండల కేంద్రానికి వెళ్తున్న ట్రాక్టర్ శనివారం దుబ్బగూడెం వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో స్తంభం పూర్తిగా విరిగిపోయింది. విరిగిన స్తంభం రోడ్డుపై పడకుండా ట్రాక్టర్ సపోర్టుతో నిటారుగా అలాగే నిలబడి ఉంది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా అవుతున్నది. స్తంభం విరిగి ఓడ్డుపై పడి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసి మధ్యాహ్నం 2గంటల తరువాత విరిగిన స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను కొనసాగించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల, జూన్ 22 : పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులోని గ్రోమోర్ దుకాణం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పందిరి శ్రీనివాస్ శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. జాన్‌పహాడ్ రోడ్డు వెడల్పులో భాగంగా విద్యుత్ స్థంభాల మార్పు పనులు చేపడుతున్నందున నేరేడుచర్ల టౌన్-1 ఫీడర్ కింద ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

తిరుమలగిరి, జూన్ 22 : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని శనివారం మండల కేంద్రంలో పట్టుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాళ్ల జనగాం గ్రామానికి చెందిన ధరావత్ బిచ్చ అనే వ్యక్తి తిరుమలగిరి మండలంలోని గ్రామాల్లో తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి మండల పరిధిలోని రాజానాయక్ తండాలో గల మాలోతు రంగమ్మ ఇంట్లో ఉంచాడు. వాటిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి రంగమ్మ ఇంట్లో నిల్వచేసిన 11 క్వింటాల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

'మహిళా శక్తి'ని విజయవంతం చేయాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, జూన్ 21 : మహిళల ఆర్థిక బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అందుకు సమగ్ర కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, మండల సమాఖ్య ప్రెసిడెంట్లు, సెక్రటరీలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఐదేండ్లలో మహిళల ఆర్థిక బలోపేతానికి మహిళా శక్తి కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. దీని ద్వారా మైక్రో ఎంటర్ ప్రైజెస్, కుట్టు కేంద్రాలు, పాడి పశువుల పెంపకం, బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ, సంచార మత్స్య విక్రయ అవుట్‌లెట్లు, మిల్క్ ప్యాలెస్, మీసేవ, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మహిళా క్యాంటీన్లు, సోలార్ యూనిట్లు, ప్లాస్టిక్ వేస్ట్ మెనేజ్‌మెంట్ యూనిట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కస్టం హైరింగ్ కేంద్రాలు వంటి 14 రకాల కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకోసం మండలాల వారీగా కార్యాచరణ రూపొందించామన్నారు. జిల్లాలోని 579 గ్రామ సమాఖ్యల్లోని 17,647 మంది స్వయం సహాయక సంఘాల ద్వారా 86 కోట్ల పెట్టుబడులతో 8,623 యూనిట్లు నెలకొల్పడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొనారు. వాటి ఏర్పాటు కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేయాలని, యూనిట్ల గురించి అందరికీ తెలియ జేయాలని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక చాలా ముఖ్యమైందని, జాగ్రత్తగా ఎంపిక చేయాలన్నారు. ట్రైనింగ్ ఇప్పించి సకాలంలో గ్రౌండింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, మత్స్య శాఖ అధికారి రూపేందర్ సింగ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితురాలికి ఇన్సూరెన్స్ చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్ కుమార్

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత

అర్వపల్లి, జూన్ 22 : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త జానయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. జానయ్య బీఆర్ఎస్ క్రీయాశీలక సభ్యత్వం కలిగి ఉండడంతో పార్టీ తరపు నుంచి రూ. 2లక్షల ఇన్సూరెన్స్ మంజూరైంది. సంబంధిత చెక్కును శనివారం నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మృతిడి భార్య సుజాతకు అందించారు.

కార్యక్రమంలో జడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్, పార్టీ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్, ఎంపీటీసీ రాచకొండ గీతా సురేశ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ పి.యుగంధర్, గ్రామాధ్యక్షుడు గోసుల విజయ్‌కుమార్, సైదులు తదతరులున్నారు.


డీటీ శ్రీధర్‌నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకులు

రైతాంగ సమస్యలను పరిష్కరించాలని వినతి

నూతనకల్, జూన్ 22 : ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు శనివారం డిప్యూటీ తాసీల్దార్ శ్రీధర్‌నాయక్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య మాట్లాడుతూ వానాకాలం సీజన్‌లో రైతాంగానికి సరిపడా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించాలన్నారు. మార్కెట్‌లోకి వచ్చిన నకిలీ విత్తనాలను ఆరికట్టడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇవ్వడం సరికాదని, రైతులు పండించిన ప్రతీ పంటకు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంటలకు బీమా కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కమిటి సభ్యుడు సుంకిరెడ్డి శ్రీనువాస్ రెడ్డి, నాయకులు దగ్గుల మల్లయ్య, జటంగి వీరమల్లు, గడ్డం పాపయ్య, సొనయ్య, దేవేందర్, వెంకన్న తదితరులున్నారు.

28న కూచిపూడి మహాసుదర్శన నారసింహ యాగం

కోదాడ రూరల్, జూన్ 22 : మండల పరిధిలోని కూచిపూడి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 28న యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహాచార్యుల అధ్వర్యంలో మహా సుదర్శన నారసింహ యాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కందికొండ సాయిబాబ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలకు ప్రారంభం కానున్న ఈ యాగానికి భక్తులు అధిక సంఖ్య లో హాజరు కావాలనని ఆయన కోరారు.

30న నూతనకల్ మండల సర్వ సభ్య సమావేశం

నూతనకల్, జూన్ 22 : ఈ నెల 30న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సునీత అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు. నివేదికలతో రావాలని సూచించారు. ఆమె వెంట ఎంపీఓ శశికళ, సూపరిండెంట్ రామకృష్ణ ఉన్నారు.

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి : ఎంపీడీఓ

నూతనకల్, జూన్ 22 : పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ సునీత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీరు సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ప్రకృతి వనాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికల్లో నాటిన మొక్కలను సంరంక్షించాలని సూచించారు. ట్యాంకర్ డ్రైవర్లను ఒక రోజు చెత్త సేకరణకు, మరో రోజు నీటికి పంపాలని సూచించారు. వీధులు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు.


మాచారంలో పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏఓ శ్రీధర్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- జిల్లా వ్యవసాయాధికారి జి.శ్రీధర్

పెన్‌పహాడ్, జూన్ 22 : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించే డీలర్లపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి జి.శ్రీధర్ హెచ్చరించారు. మండల పరిధిలోని దూపహాడ్‌లో ఫర్టిలైజర్ దుకాణాలు, మాచారంలో పంటల సాగును శనివారం పరిశీలించి మాట్లాడారు. డీలర్లు కావాల్సిన వరి, పత్తి, ఇతర విత్తనాలు విక్రయించేటప్పుడు రైతులకు సంబంధిత బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఆ బిల్లులపై విత్తనాలకు సంబంధించిన వివరాలు క్లుప్తంగా రాయాలనే సూచించారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణసందీప్, ఏఈఓ గోపి, డీలర్ గోపి, రైతులున్నారు.

రామారావు ఆశయాలు సాధించాలి : వీరాంజనేయులు

రామారావు స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నడిగూడెం, జూన్ 22 : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కృష్ణసాగరపు రామారావు ఆశయాలు సాధించాలని సీపీఎం సీనియర్ నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు అన్నారు. మండల పరిధిలోని రామాపురంలో శనివారం రామారావు ఐదో వర్ధంతిలో పాల్గొని మాట్లాడారు. రామారావు భూమి, భుక్తి కోసం అనేక పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. పొన్నం ఏసయ్య, వీరబాబు, వాసు, పవన్, సౌభాగ్యం, రామానుజమ్మ, పద్మావతి, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జి చైర్మన్‌గా చెన్నగోని

చౌటుప్పల్, జూన్ 22 : చౌటుప్పల్ సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జి చైర్మన్‌గా చెన్నగోని అంజయ్యగౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా బోరెం నర్సిరెడ్డి, బాతరాజు సాయిలు, దూర్క కృష్ణా, సప్పిడి వెంకట్‌రెడ్డి, బొడ్డు పద్మను నియమించారు. సంఘం సర్వసభ్య సమావేశాలు నిర్వహించలేదనే ఆరోపణల నేపథ్యంలో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలోని పాలకవర్గాన్ని రద్దు చేశారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న అంజయ్యగౌడ్

సైబర్ నేరాలపై అవగాహన

వర్ధమానుకోటలో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డి

నాగారం, జూన్ 22 : ఏఎస్పీ నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో వర్ధమానుకోటలో శుక్రవారం రాత్రి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో మహిళలు, విద్యార్థుల రక్ష, చట్టాలు, విద్యా విధానాలు, సమస్యలను అధిగమించడం, సోషల్ మీడియా, ఇంటర్‌నెట్ సద్వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి లక్ష్యాలను చేరుకోవాలని లక్ష్యం కోసం కృషి చేయాలని పాటల ద్వారా తెలియజేశారు. నాగారం ఎస్ఐ వెంకటరెడ్డి మాట్లాడుతూ మహిళల రక్షణకై పటిష్టంగా పని చేస్తున్నామని గ్రామాల్లో ఎలాంటి సమస్యలు వచ్చినా శాంతి భద్రతలకు ఆటంకం కలిగించకుండా పరిష్కారం చేసుకోవాలన్నారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా, ఓటీపీల వివరాలను ఇతరులకు తెలుపవద్దన్నారు. సైబర్ మోసాలకు 1930, 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటరాములు, సిబ్బంది ఎల్లయ్య, లింగయ్య, వీరునాయక్, కళాబృందం ఇన్‌చార్జి ఎల్లయ్య, గోపి, కృష్ణ, చారి, గురులింగం పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

నీట్‌ను రద్దు చేయాలి : డీవైఎఫ్ఐ

చిలుకూరు, జూన్ 22 : నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోయిళ్ల నవీన్ అన్నారు. కోదాడ-హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీక్ వల్ల పేద విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. నీట్ పేపర్ లీక్‌పై ఇంత వరకు ప్రధాని మోదీ నోరు మెదపడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వినోద్, జంగం పల్లి సాయికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లాలబావి సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

బొగ్గు గనుల వేలాన్ని ఉపసంహరించుకోవాలి : సీఐటీయూ

బొడ్రాయిబజార్, జూన్ 22 : బీజేపీ ప్రభుత్వం దేశంలో బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సీఐటీయు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక నల్లాలబావి సెంటర్‌లో శనివారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధి జరిగిందని, ఫలితంగా సింగరేణి విద్యుత్ ఉత్పాదనలో కూడా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సింగరేణి బొగ్గు గనులను కాపాడేందుకు జరిగే పోరాటంలో అభ్యుదయవాదులు, మేధావులు, కార్మికులు కలసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, శ్రామిక మహిళా కన్వీనర్ చెరుకు యాకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు మేకనబోయిన శేకర్, వి.సాయి కుమార్, ప్రజా సంఘాల నాయకులు కోట గోపి, వేల్పుల వెంకన్న, రవి పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక

ఏరువాకలో పాల్గొన్న రైతులు

నడిగూడెం, జూన్ 22 : మండల పరిధిలోని నారాయణపుంలో సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండాలని గోమాతకు పూజలు చేశారు. అనంతరం సేంద్రియ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు వెంకట్‌రెడ్డి, కన్నెబోయిన రామారావును సన్మానించారు. కార్యక్రమంలో సిరి ఫౌండేషన్ చైర్మన్ మొలుగూరి గోపి, రైతులు నాగిరెడ్డి లింగారెడ్డి, వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి, పెద్ద వెంకటేశ్వర్లు, సీతారాంరెడ్డి, గుర్వారెడ్డి, వీరబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

హుజూర్‌నగర్, జూన్ 22 : పట్టణ పరిధిలోని గోవిందపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హుజూర్‌నగర్‌కు చెందిన పశ్య ప్రవీణ్‌రెడ్డి తన తండ్రి రాంరెడ్డి, పెద్దనాన్న నర్సింహారెడ్డి - ధనలక్ష్మి జ్ఞాపక కార్థం శనివారం పుస్తకాలు, పెన్నులు, బాక్సులు, పలకలు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సౌజన్య, ధనమ్మ, హెచ్ఎం భాష, ఉపాధ్యాయులు గొట్టే శ్రీనివాస్, పాఠశాల కమిటీ చైర్మన్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలి : సీఐటీయూ

గరిడేపల్లి : పొనుగోడులో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

గరిడేపల్లి, జూన్ 22 : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24, 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు యాకూబ్ అన్నారు. మండలంలోని పొనుగోడు పంచాయతీ కార్యాలయం ఎదుట పెండింగ్ వేతనాలు చెల్లించాలని సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. కార్మికులు సత్యనారాయణ, చంద్రయ్య, బాలకృష్ణ, సైదులు, హరీశ్, నాగరాజు, వీరబాబు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమావేశం

మఠంపల్లి : మఠంపల్లి మండల గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం పారిశుధ్య కార్మికుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా హాజరై పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కమిటీ అధ్యక్షుడిగా ఆలేటి కాశయ్య, కార్యదర్శిగా విజయలక్ష్మి, కోశాధికారిగా భిక్షునాయక్‌ను ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యులు కొత్తపల్లి దాసు, సైదానాయక్, నాగలక్ష్మి, కోటేశ్వరరావు, ప్రభాకర్, రమావత్ లక్ష్మి తదితరులున్నారు.

కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

'కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి'

మద్దిరాల, జూన్ 22 : రాష్ట్రంలో మూడు లక్షలకు పైగా ఉన్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను యుద్ధ ప్రాతిపదికన పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) మండలాధ్యక్షుడు మరికంటి ఉపేందర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలవుతున్నా కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు.

ఈనెల 26న జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. జిల్లా నాయకులు నాగెల్లి రామనర్సయ్య, మాదాసు యాదగిరి, శ్రీను, ఉప్పలయ్య, కిరణ్, రాములు, సతీశ్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నర్సరీలో మొక్కల పరిశీలన

నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ హసీం

ఆత్మకూర్.ఎస్, జూన్ 22 : హరిత హారం కార్యక్రమానికి సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ ఎండీ. హసీం కోరారు. మండల కేంద్రంలోని వన నర్సరీని శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ విడుతలో ఆత్మకూర్.ఎస్ మండలంలో 2.60లక్షల మొక్కలను నాటే విధంగా లక్ష్యాన్ని నిర్ణయించినట్లు తెలిపారు. వర్షాలు పడగానే మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమవుతుందని, సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. ఎపీఓ ఈశ్వర్, టెక్నికల్ అసిస్టెంట్ విజయ్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులున్నారు.

అర్వపల్లిలో అమృతారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాకులు

'అమృతారెడ్డి ఆశయ సాధనకు పోరాడాలి'

- 30వ వర్ధంతి సందర్భంగా పలుచోట్ల నివాళి

బొడ్రాయిబజార్/అర్వపల్లి/నాగారం, జూన్ 22 : కామ్రేడ్ గుర్రం అమృతారెడ్డి 30వ వర్ధంతి సందర్భంగా శనివారం సూర్యాపేటలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో, అర్వపల్లి మండల కేంద్రంలో, నాగారంలోని డి.కొత్తపల్లి గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అమృతారెడ్డి ఆశయ సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. సూర్యాపేట కార్యక్రమంలో ఇప్టా జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఇప్టూ జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రవి, అరుణోదయ జిల్లా ఉపాధ్యక్షులు బొల్లె వెంకన్న, పీవైఎల్ జిల్లా కోశాధికారి బండి రవి, పార్టీ నాయకులు పెద్దింటి అశోక్‌రెడ్డి, వీరబోయిన లింగయ్య, రాజేష్, రమేష్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

అర్వపల్లిలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలెబోయిన కిరణ్, ఎస్‌డీఎల్‌సీ నాయకులు పోలెబోయిన పెద్ద లింగయ్య, వాడకల బయన్న, మధుకర్, గోపయ్య పాల్గొన్నారు.

నాగారం మండలంలోని డి.కొత్తపల్లి గ్రామంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, మాజీ సర్పంచ్ యానాల సుధాకర్‌రెడ్డి, పెరమాళ్ల సత్తయ్య, కళింగరెడ్డి, లింగయ్య, ఎస్‌డీ.సమద్, రాకేశ్, సురేశ్, రమేశ్, సైదులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★Corel Draw Photo Shop Designer M/F Sal: 20K, Office Clerk Female Calculation & Receptionist Sal: 15K, 2 No's Marketing Executives (Male) Sal: 18K. Near RTC X-Road, Pillar No. 34 & 35. 9849003504.
NT-97639-All

PLOTS FOR SALE
AP రాజధాని అమరావతిలో CRDA అప్రూవ్డ్ వెంచర్స్ కలవు. ORR 1/2KM కంచికచర్లకి 8KM గజం కేవలం 8499/-, పూలింగ్ ఏరియాకి ఆనుకొని గజం 25999/-, Cell:9100178179, 9849561472.
NLG-323529

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ
నల్గొండ : 9182777628 | సూర్యాపేట : 9182777635 | దేవరకొండ : 9182777635
హుజూర్‌నగర్ : 9182777059 | కోదాడ : 9182777630 | భువనగిరి : 9182777630
మిర్యాలగూడ : 9182777059 | యాదాద్రి : 9182777630